క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం గురుకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ యర్రగుంట్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న శ్వేత, పదో తరగతి చదువుతున్న జై కిరణ్ అనంతపురం ఆర్ట్స్ కాలేజీలో సోమవారం జరిగిన అండర్ -19 ఏపీ స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే విద్యార్థులు నవంబర్‌లో సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం తెలిపారు. అలాగే ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, పీడీ రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాగరత్నమ్మ, నాగేశ్వరరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

శింగనమల(నార్పల): వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని, ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వైఎస్సార్‌సీపీ తరఫున తీర్మానించారు. మంగళవారం నార్పల ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్ పర్సన్ నాగరత్నమ్మ మాట్లాడుతూ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందకుండా పోతుందన్నారు. గత ప్రభుత్వం పేద విద్యార్థులకు తెచ్చిన 17 వైద్య కళాశాలలను , ఈ ప్రభుత్వం ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అన్నారు. అనంతరం ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, ఎంపీపీ కలసి ఎంపీడీఓ మమతాదేవికి వినతిపత్రం అందజేశారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి



క్రియేటర్ కృష్ణను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంతకల్లు: యువత వ్యసనాలకు దూరంగా ఉండి..క్రమశిక్షణతో మెలగాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రియేటర్ కృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక శ్రీ శంకరనంద గిరి స్వామి కళాశాలలో పట్టణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్య శ్రేయస్సు, వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. క్రియేటర్ కృష్ణ మాట్లాడుతూ దురలవాట్లు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు, గురువులు, సమాజం పట్ల బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సన్మార్గంలో నడుస్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గోపాలకృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఖాజా గరీబ్ నవాజ్, అధ్యాపకులు వెంకటరమణ, కృష్ణయ్య, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాఘడ్‌లో ప్రత్యేక పూజలు



సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న గణపతి స్వామి

గుత్తి రూరల్: మండలంలోని సేవాఘడ్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతిలో ఈ నెల 18, 19 తేదిలలో జరిగే హాథీరామ్ బావాజీ వార్షికోత్సవ సమేళనాన్ని పురస్కరించుకుని మాత జగదాంబ, సేవాలాల్ ఆలయాల్లో హోమాలు, అభిషేకాలు, అర్చనలు, హారతి తదితర ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గణపతి స్వామి సేవాఘడ్ నుంచి హాథీరామ్ బావాజీ ఘడ్ అయిన తిరుపతి వరకూ సేవాలాల్ మహారాజ్ జ్యోతి తీసుకుని బయలుదేరారు. సేవాఘడ్ నుంచి బయలుదేరిన జ్యోతి దారి మధ్యలో ఉన్న అన్ని తండాల మీదుగా ఈ నెల 18కి తిరుపతికి చేరుకుంటుందని గణపతి స్వామి తెలిపారు. జ్యోతిని ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేసి సాగనంపారు. కార్యక్రమంలో సేవాలాల్ ట్రస్టు సభ్యులు భూక్యా వెంకటరమణ నాయక్, హాథీరామ్ బావాజీ కమిటీ సభ్యులు కృష్ణనాయక్, నారాయణనాయక్, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కంపు



ఎంఈ చాంబర్ వెనుక పాడుబడిన మరుగుదొడ్ల వద్ద నిల్వ ఉన్న మురుగు



జనరేటర్ రూమ్ పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు

గుంతకల్లుటౌన్: పారిశుద్ధ్య నిర్వహణలో ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచి అవార్డును సొంతం చేసుకున్న గుంతకల్లు మున్సిపాలిటీలో నేడు అపరిశుభ్రత తాండవిస్తోంది. పట్టణంలోనే కాదు..మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కూడా పరిసరాలు కంపు కొడుతున్నాయి. కమిషనర్, ఎంఈల చాంబర్ల వెనుక పాడుబడిన టాయిలెట్లను తొలగించకపోవడంతో మురుగు మొత్తం నిలిచిపోయింది. వర్షం పడినప్పుడు పరిసరాలు కంపు కొడుతాయి. ఇక జనరేటర్ రూమ్ పక్కన పిచ్చిమొక్కలు పెరిగినా.. వాటిని తొలగించేంత సమయం సిబ్బందికి లేదు. కార్యాలయంలోనే పరిశుభ్రతను పాటించని అధికారులు ప్రజలకు స్వచ్ఛ పాఠాలు చెప్పడం పట్ల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆర్టీసీ డిపోలో సమస్యల తిష్ట

గుత్తి: గుత్తి ఆర్టీసీ డిపోలో సమస్యలు తిష్ట వేశాయి. గత 17 ఏళ్లగా ఇన్‌చార్జ్ డిపో మేనేజర్ పాలనలో డిపో కొనసాగుతోంది. 2007లో నష్టాల పేరుతో డిపోను మూసి వేశారు. ప్రజా ఆందోళనలతో ప్రభుత్వం దిగొచ్చి ఏప్రిల్ 7, 2008లో డిపోను పున: ప్రారంభించింది. అయితే ఇంతవరకూ డిపోనకు పూర్తి స్థాయి డీఎం లేడు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలు చెప్పుకోవడానికి డీఎం అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. పైగా ఎమర్జెన్సీ సమయాల్లో మరింత ఇక్కట్లు పడుతున్నారు. గుంతకల్లు డీఎం గుత్తి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అలాగే ఏడాది క్రితం ఎస్టీఐను సస్పెండ్ చేశారు. ఆ స్థానంలో ఇంతవరకు ఎవరినీ నియమించలేదు. డీఎం, ఎస్టీఐ లేకపోవడంతో కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే పూర్తి స్థాయి డీఎంను నియమించడంతో పాటు ఎస్టీఐను కూడా నియమించాలని కార్మికులు కోరుతున్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో దోపిడీ

- రచ్చబండ కార్యక్రమంలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్



మద్దిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త సాకే శైలజానాథ్

పుట్లూరు: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో రూ.వేల కోట్ల దోపిడీకి సీఎం చంద్రబాబు తెరలేపారని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన మండలంలోని మడుగుపల్లి, మద్దిపల్లి, ఎల్లుట్ల, జంగంరెడ్డిపేట గ్రామాల్లో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా గత ప్రభుత్వంలో రూ.8 వేల కోట్లు కేటాయించి 17 వైద్య కళాశాలలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుడితే కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరణ చేయాలని చూడటం సిగ్గుచేటన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు 50 సీట్లు కేటాయిస్తే వాటిని మన రాష్ట్రానికి వద్దంటూ ఎన్ఎంసీకి లేఖ రాసిన వ్యక్తి చంద్రబాబునాయుడని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ పేద విద్యార్థులకు అండగా ఉంటుందని, వైద్య విద్య అభ్యసించాలనే విద్యార్థుల కోసం చేపడుతున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలో అప్పులు చేసి జల్సాలు చేయడం పరిపాటిగా మారిందని, ప్రజలకు ఉపయోగపడే పనులను అడ్డుకోవడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. రూ.కోట్ల విలువైన భూములను తక్కువ ధరలకు తమ అనుయాయులకు కేటాయిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలందరికీ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ జరిగితే పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని, ఈ విషయాన్ని గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ వివరించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, జిల్లా కార్యదర్శులు విష్ణునారాయణ, రమణాయాదవ్, నాయకులు పద్మావతమ్మ, నాగేశ్వరరెడ్డి, మద్దిపల్లి ప్రభాకర్‌రెడ్డి, నీలం భాస్కర్, కంచెం శ్రీనివాసులరెడ్డి, శివారెడ్డి, సుధాకర్, నారాయణస్వామి, సూరి, కేతిరెడ్డి సురేష్ రెడ్డి, శ్రీరాములు, వెంకటశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సంతకాల సేకరణ' జయప్రదం చేయండి

తాడిపత్రిటౌన్: గత వైఎస్సార్ ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేపటడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణను విజయవంతం చేయాలని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పిలుపునిచ్చారు. తాడిపత్రి పట్టణంలోని తన నివాసంలో ఆయన మంగళవారం సంతకాల సేకరణ కార్యక్రమంపై ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో, పట్టణంలోని వార్డుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులకు ఫీజుల భారంతో వైద్య విద్య అందనంత దూరం అవుతుందన్నారు. అలాగే ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుందన్నారు. పేదలకు



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

మధ్యతరగతి వారికి సూపర్ స్పెషాలిటీ సేవలు దూరమవుతాయన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ జరిగితే ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజలను దోచుకునే పరిస్థితి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ సంస్థల ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం రాజ్యాంగం పౌరులకు ఇచ్చిన ప్రాథమిక హక్కుపై జరుగుతున్న దాడిగా భావించి ప్రజలను చైతన్య వంతులను చేసి సంతకాల సేకరణ చేపట్టాలని సూచించారు. పేరం ప్రతాప్‌రెడ్డి, కంచం రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, పేరం అమర్‌నాథరెడ్డి, హరినాథరెడ్డి, రఘునాథరెడ్డి, యోగేశ్వరెడ్డి, అమర్‌నాథరెడ్డి, గడ్డం పరమేష్, అయూబ్, డీవీ కుమార్, నాగూర్ షరీఫా, రవి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించొద్దు



మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టర్లు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పామిడి: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ ప్రధాన కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి మాట్లాడారు. మాజీ సీఎం జగన్ హయాంలో పేద ప్రతిభావంత విద్యార్థుల కోసం అదనపు మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశారన్నారు. ఆ మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసి పేద విద్యార్థులకు మెడికల్ విద్యను అందని ద్రాక్షలా చేస్తోందన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ నాగూరు ఈశ్వర్‌రెడ్డి, ముస్లీం, క్రిస్టియన్ మైనార్టీ నాయకులు మహమ్మద్ గౌస్, పీ అనిల్‌కుమార్‌రాజా, రజాక్, బోయ రామచంద్ర, పార్వతీశ్వర్‌రెడ్డి, నీలకంఠారెడ్డి, వెంకటగుప్తా, చాకలి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రంగడు

గుత్తి: భార్య అకాల మృతిని జీర్ణించుకోలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. గుత్తి మండలం ఊబిచెర్ల గ్రామానికి చెందిన రంగడు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆరు మాసాల క్రితం భార్య గుండెపోటుతో మృతి చెందింది. అప్పటి నుంచి మనోవేదనకు లోనై ఎవరితోనూ మాట్లాడకుండా ముభావంగా ఉండేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గుత్తి ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లో ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడ్డాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న రంగడుని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. ఘటనపై రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఫ్యాక్టరీల తనిఖీ

తాడిపత్రి రూరల్: మండలంలోని పలు ఫ్యాక్టరీలను మంగళవారం ఆర్డీఓ కేశవ నాయుడుతోపాటు తహసీల్దార్ సోమశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ఫ్యాక్టరీ సేఫ్టీ శాఖల అధికారులు తనిఖీ చేశారు. మండలంలోని వీరాపురం వద్ద ఉన్న అర్జాస్ స్టీల్ ప్లాంట్, తలారిచెరువులోని అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, బుగ్గ వద్ద గల అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. కార్మికుల భద్రత, పొల్యూషన్ కంట్రోల్ కోసం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వివిధ వర్గాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని వారు తెలిపారు.

రేపు మండల సమావేశం

యాడికి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో గురువారం ఎంపీపీ బొంబాయి ఉమాదేవి అధ్యక్షతన జరిగే మండల సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఎంపీడీఓ వీర్రాజు మంగళవారం తెలిపారు. సమావేశానికి హాజరుకాని వారిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపి చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ముందు వెళ్తున్న కారును తప్పించబోయి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో బైక్‌లో ఉన్న గుత్తికి చెందిన రామన్న, అహ్మద్ గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

గురుకుల పాఠశాల నిర్మాణానికి నేడు శంకుస్థాపన

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవర కొండ వద్ద గురుకుల బాలుర పాఠశాల నిర్మాణాకి శంకు స్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ హర్జేనాయక్ తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ ఆనంద్ హాజరు అవుతారన్నారు. అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

ఇసుక టిప్పర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని చీమలవాగుపల్లి జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం పోలీసుల వాహనాల్లో తనిఖీలో అనుమతులు లేకుండా తాడిపత్రి వైపు నుంచి గుంతకల్లుకు ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సీజ్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మండలంలో ఇసుక తరలిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వ్యక్తి మృతి

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో హిందూపురం పట్టణానికి చెందిన కిష్టప్ప(59) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. కిష్టప్పతో కలిసి మరో ముగ్గురు గొర్రెల కాపర్లు బొలెరో వాహనంలో హైదరాబాద్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా.. టోల్‌గేట్ వద్ద నిద్ర మత్తులో అతడు వాహనంలో నుంచి జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన కిష్టప్ప అతడిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. అతడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దోమల నివారణకు గంబూషియా చేపలు



గుత్తిలోని వక్కల కుంటలో గంబూషియా చేపలు వదులుతున్న దృశ్యం



రజాపురం శివారులోని కుంటలో గంబూషియా చేపలు వదులుతున్న వైద్య సిబ్బంది

గుత్తి/గుత్తిరూరల్: దోమల నివారణకు ఆరోగ్య శాఖ, మలేరియా అధికారులు మంగళవారం పట్టణంలోని వక్కల కుంట, దిడ్డి కుంటతో పాటు పలు బావుల్లో గంబూషియా చేపలను వదిలారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రభాకర్ మాట్లాడుతూ గంబూషియా చేపలు దోమల లార్వాను తినేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. అలాగే మండలంలోని ఊబిచెర్ల, రజాపురం గ్రామాల్లోని చెరువు, కుంటలు, బావుల్లో వైద్య సిబ్బంది దోమల నివారణకు గంబూషియా చేపలను వదిలారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్త ఆంజనేయులు, ఏఎన్ఎంలు రూప, రుబియా, నాగవేణి, రోజా, మాధవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలారిష్టాలు దాటని పట్టణాభివృద్ధి



దీక్షలో కూర్చున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: పట్టణాభివృద్ధి బాలారిష్టాల నుంచి బయటపడటం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గుంతకల్లు పట్టణ అభివృద్ధిపై పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షతకు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ పట్టణంలోని కసాపురం రైల్వే మోరీ, ధర్మవరం ఎల్‌సీ గేట్, బళ్లారి రోడ్డులోని ఎల్‌ఎసీ గేట్‌లు పట్టణాభివృద్ధికి అవరోధంగా మారాయన్నారు. కసాపురం రైల్వేమోరీ విస్తరణ చేయడంతోపాటు ధర్మవరం ఎల్‌గేట్ వద్ద నిర్మించతలపెట్టిన యూ ఆకారం ఆర్‌యూబీ పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. అదేవిధంగా అంకోలా-నెల్లూరు జాతీయ రహదారిలోని బళ్లారి ఎల్‌గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిను ఏర్పాటు చేయాలన్నారు. ఇక గుత్తి-గుంతకల్లు మధ్య నిలిచిపోయిన జాతీయ రహదారి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. పట్టణంలోని ఆలూరు, ఉరవకొండ వెళ్లే రహదారులను మరమ్మత్తులు చేయించాలన్నారు. ఉర్దూ కళాశాలను ప్రారంభించాలన్నారు. దీక్షలో మహేష్, గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు, దాసరి శ్రీనివాసులు, దేవేంద్ర, చిదాంబరం, ఓబులేసు, పుల్లయ్య, శ్రీను తదితరులు కూర్చొన్నారు.

మూలనపడ్డ డిజిటల్ కియోస్కులు



పుట్లూరు మండలం అరకటివేముల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న డిజిటల్ కియోస్క్

పుట్లూరు: డిజిటల్ కియోస్కులు మూలనపడడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాటు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు, రైతులకు మెరుగైన సేవలను అందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేసింది. అయితే అప్పట్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు, పంట కొనుగోలు కార్యక్రమాలు చేపట్టగా ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు విత్తనాలు, ఎరువుల పంపిణీ చేయట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. యూరియా, డీఏపీ ఎరువులను ఈ ఏడాది కొన్ని రైతు సేవా కేంద్రాల్లో అరకొరగా మాత్రమే అందించారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ కియోస్కులు ప్రస్తుతం ఆయా కార్యాలయాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తుండటం గమనార్హం. వ్యవసాయ అధికారులు స్పందించి కియోస్కులను అందుబాటులోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

నార్పల వాసిపై చీటింగ్ కేసు నమోదు

కడప అర్బన్: కడప నగరం పూసల వీధికి చెందిన హరేరామ్‌కు ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు. కడప పూసల వీధికి చెందిన హరి రామ్ బీటెక్ పూర్తి చేసుకుని ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తుండేవాడు. నార్పలకు చెందిన ప్రసన్నకుమార్ రెడ్డి ఉద్యోగం ఇప్పిస్తానంటూ మాయమాటలు చెప్పి దాదాపు రూ.1.30 లక్షలు వసూలు చేసి నకిలీ ఉద్యోగ నియామకపత్రం ఇచ్చాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రసన్నకుమార్‌రెడ్డి పై చీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీఎస్టీ ప్రయోజనాలపై వ్యాస రచన పోటీలు

గుత్తి: పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు మంగళవారం మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో జీఎస్టీపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన తొమ్మిది మంది విద్యార్థులకు సీఈఓ శ్రీరాములు, ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర రెడ్డి, ప్రసన్నకుమార్, అధ్యాపకులు బహుమతులతో పాటు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.